సాక్షి ఆదిలాబాద్

బుధవారం, 1, మార్చి, 2023



ఘనంగా సైన్స్ దినోత్సవం

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. 9లో▸



నాలుగు పులులెక్కడ? 10లో▸

భీంపూర్ మండలంలోని పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో పులుల కదలికలు రెండు రోజులుగా కానరావడం లేదు. సీసీ కెమెరాలకు సైతం వాటి ఆనవాళ్లు చిక్కని పరిస్థితి.

గరిష్టం/కనిష్టం 36.0/20.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పట్టణ అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



మాట్లాడుతున్న చైర్మన్ ప్రేమేందర్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్మన్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు దుస్తుల అందజేత, అనుకుంట కాలనీలో శ్మశానవాటిక నిర్మాణం, లీగల్ కౌన్సిల్ సభ్యుడి నియామకంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ఎనిమిది అంశాలతో కూడిన ఎజెండాకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఆయా అంశాలతో కూడిన ఎజెండాపై కొద్దిపాటు చర్చించిన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కమిషనర్ శైలజ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

3నుంచి శనగ కొనుగోళ్లు

కైలాస్‌నగర్: జిల్లాలో శనగ కొనుగోళ్లను ఈనెల 3వ తేదీ నుంచి ఆదిలాబాద్, జైనథ్, బేల వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ప్రారంభించనున్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ గౌరీ నాగేశ్వర్ ప్రకటనలో తెలిపారు. ఆయా యార్డుల పరిధిలోని రైతులకు గ్రామాల వారీగా సంబంధిత ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, వ్యవసాయ అధికారుల ద్వారా షెడ్యూల్ ప్రకటిస్తామని పేర్కొన్నారు. తదనుగుణంగా రైతులు తేమ శాతం 14కు మించకుండా నాణ్యమైన సరుకును మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. మిగతా యార్డుల్లో వారం వ్యవధిలో కొనుగోళ్లు ప్రారంభిస్తామని, రైతులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కులవృత్తులకు అండగా ఉంటాం

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: కులవృత్తులతో జీవనోపాధి పొందుతున్న వారికి అండగా ఉంటామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో మంగళవారం నిర్వహించిన టైలర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సంఘం జెండా ఆవిష్కరించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన బీసీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కష్టనష్టాలు ఎదురైనప్పటికీ టైలరింగ్ వృత్తిలో కొనసాగడం అభినందనీయమని పేర్కొన్నారు. డీసీసీబీ తరఫున అవసరమైన వారికి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రంగినేని మనీషా, మేరు సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాజు, నర్సింగ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జలగం అనిత ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ (అప్లికేషన్స్)సబ్జెక్ట్ పోస్ట్ ఖాళీగా ఉందని పేర్కొన్నారు. బోధన అనుభవం ఉన్నవారిని అదనపు అర్హతగా పరిగణిస్తామని తెలిపారు. మార్చి 4న కళాశాలలో ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని, 6న ఇంటర్వ్యూ ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

కైలాస్‌నగర్: దివ్యాంగుల ఉపాధి, పునరావాసం పథకం కింద 2022–23 సంవత్సరానికి గాను వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాల స్థాపనకు సంబంధించిన దరఖాస్తు గడువు ఈ నెల 6వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమాధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగులు http:// tsobmms. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఆదిలాబాద్‌అర్బన్: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రం దస్నాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జగన్ సింగ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిడాం సాయికుమార్, హరీష్ రాథోడ్, సాయికిరణ్, కుమ్ర అశోక్, అనిల్, రవి, సుభాష్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

చేతులెత్తేశారు..!



నిర్మల్ జిల్లాలోని మాడెగాంలోని నీటి శుద్ధి ప్లాంట్ (ఫైల్)

నేరడిగొండ మండలం ఆరెపల్లి నుంచి నిర్మల్‌కు వెళ్లే దారిలో ఆదిలాబాద్ ఎంఎస్ పైపులైన్ నుంచి అక్రమంగా పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని మళ్లిస్తున్న దృశ్యం (ఫైల్)

- నీళ్ల దోపిడీ యథాతథం • ఆగని 'మిషన్ భగీరథ' మళ్లింపు
- గతేడాదే గుర్తించినా మారని తీరు • పొరుగు జిల్లా రాజకీయ పలుకుబడే కారణం?
- కోటాను మించి వస్తున్నాయంటున్న అధికారగణం
- ప్రెషర్‌లేకపోవడం, విద్యుత్ సమస్య ఉత్పన్నమైతే సమస్యే
- పొంచి ఉన్న వేసవి ముప్పు.. చివరి గ్రామాలకు నీరందేది అనుమానమే

సాక్షి,ఆదిలాబాద్: నీళ్ల దోపిడీ యథాతథంగా కొనసాగుతోంది. ఈ అక్రమ మళ్లింపును ఆపలేక జిల్లా అధికారులు చేతులెత్తేశారు. పక్క జిల్లా నిర్మల్‌లో అధికార ముఖ్యనేత పలుకుబడితో ఈ దౌర్జన్యాన్ని బాహాటంగానే కానిచ్చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో దీనిపై ఫిర్యాదు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. జిల్లా నేతలు కూడా ఆ ముఖ్య నేతను ఎదురించలేక జరిగే తంతును చూస్తున్నారే తప్ప జిల్లాకు ఒనగూరుతున్న నష్టాన్ని నివారించలేకపోతున్నారు. కోటా మేర జిల్లాకు మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా లేదా అంటూ విషయాన్ని సర్దిపుచ్చుతున్నారు. అయితే ప్రెషర్‌తో నీళ్లు రాకపోవడం, కరెంటు సమస్య ఉత్పన్నమైనప్పుడు చివరి వరకు నీళ్లు చేరని పరిస్థితి ఉంది. ఈ సమస్యను పట్టించుకున్నవారే లేరు.

విషయం ఇది..

నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల పరిధిలోకి వచ్చే శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (ఎస్సారెస్పీ) నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు నీటి వనరుగా ఉంది. ప్రాజెక్టు నుంచి వచ్చే నీళ్లను నిర్మల్ జిల్లా మాడెగాం వద్ద నీటి ప్లాంట్‌లో శుద్ధి చేస్తారు. అక్కడి నుంచి రెండు వేర్వేరు డిజైన్‌లు ఉన్న పైపులైన్ల ద్వారా ఆయా జిల్లాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తారు. అయితే ఆదిలాబాద్ జిల్లాకు వచ్చే నీటిని నిర్మల్ జిల్లాలోనే ప్రధాన పైప్‌లైన్ నుంచి పలు చోట్ల ట్యాపింగ్ చేసి అక్రమంగా ఆ జిల్లాలోని మున్సిపాలిటీకి తరలిస్తున్నారని గతేడాది వెలుగులోకి వచ్చింది. దీనిపై ఆదిలాబాద్ జిల్లా మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు ఉన్నతాధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అయినా దాన్ని ఆపే ప్రయత్నం అప్పుడు ఎవరు చేపట్టలేదు. ఇప్పటికీ అదే తంతు కొనసాగుతోంది. అప్పట్లో ఇంజినీరింగ్ చీఫ్ దృష్టికి వెళ్లినప్పటికీ సమస్యకు పరిష్కారం దొరకలేదు.

వేసవిలో ఇబ్బందులే..

ఇప్పటికే జిల్లాలోని కొన్ని మండలాల్లో తాగునీటి సమస్య కనిపిస్తోంది. నార్నూర్ మండలంలో తాగునీటి కోసం మంగళవారం మహిళలు ఆందోళన చేపట్టారు. అలాగే పలు గ్రామాల్లో ఏటా వేసవిలో నీటి ఎద్దడి తలెత్తుతుంది. మిషన్‌భగీరథ నీళ్లు ప్రెషర్‌తో జిల్లాకు చేరుకుని సమయానికి ఇంట్రా పైప్‌లైన్ ద్వారా గ్రామాలకు చేరువైతే సమస్య ఉత్పన్నం కాదు. వేసవిలో కరెంటు కోతలు తీవ్రంగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో మాడెగాం నుంచి నీళ్ల కోటా సమయానికి రాకపోతే మాత్రం గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి సమస్య తలెత్తే అవకాశం లేకపోలేదు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో ఈ ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. కోటా నీళ్లు వస్తున్నాయని చెబుతున్న అధికారులు చివరి పాయింట్ గ్రామాలకు కూడా సరఫరా అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉందని ప్రజలంటున్నారు.

సమస్య ఇలా..

నిర్మల్‌లో ఆదిలాబాద్ పైపులైన్‌కు ఏడు చోట్ల ట్యాపింగ్ చేశారని గతేడాది నిర్ధారణ అయింది. అయితే ఇప్పటి వరకు దాన్ని నివారించలేకపోయారు. ఇంకా ట్యాపింగ్‌లు పెరిగాయని తెలుస్తోంది. అయితే జిల్లాకు కోటా మేరకు నీళ్లు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో సమస్యే లేదనట్టుగా మాట్లాడుతున్నారు. అయితే వాస్తవ పరిస్థితి మరోలాగా ఉంది. ట్యాపింగ్ కారణంగా జిల్లాకు వచ్చే మిషన్ భగీరథ నీళ్ల ప్రెషర్ తగ్గిపోయింది. అంతే కాకుండా కరెంటు కోతల కారణంగా ఇక్కడి వరకు పూర్తి స్థాయిలో సమయానికి నీళ్లు అందని పరిస్థితి. ఈ క్రమంలో సుంకిడి, ఖండాల వైపు వెళ్లే ఇంట్రా పైపులైన్ ద్వారా చివరి వరకు నీళ్లు చేరుకోని పరిస్థితి పలుమార్లు ఉత్పన్నం అయినట్లు తెలుస్తోంది. ఇలా సుమారు 140 గ్రామాలకు ఈ సమస్య ఎదురవుతోంది. రోజంతా కలిపి కోటా మేరకు నీళ్లు వస్తున్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ సమయానికి నీళ్లు అందకపోతే పరిస్థితి ఏంటన్న విషయంలో వారివద్ద స్పష్టత లేదు.

కోటా మేరకు వస్తున్నాయి



ఆదిలాబాద్ జిల్లాకు నిర్ధారిత కోటా 80 ఎంఎల్‌డీ వస్తున్నాయి. అంతకంటే ఎక్కువ కూడా వస్తున్నాయి. ప్రతీ 15 రోజులకోసారి కోటా మేర వస్తున్నాయా లేదా అనేది చెక్ చెస్తున్నాం. నీటి సమస్య అంతగా లేదు.

– వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఆదిలాబాద్

ఓటు.. ఇక ఒకే చోట

- రెండేసి చోట్ల ఉన్నవారిని గుర్తించిన ఈసీ
- 6,188 మంది వివరాలు జిల్లాకు అందజేత
- క్షేత్రస్థాయిలో విచారిస్తున్న బీఎల్‌వోలు
- తదనుగుణంగా చర్యలు



బీఎల్‌వోలు అందజేసిన వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేసే దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఒకే ఫొటో, ఒకే పేరుతో రెండు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న వారిని ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా గుర్తించింది. వారి వివరాలతో కూడిన ఫొటో సిమిలర్ ఎంట్రీస్ (పీఎస్ఈ) జాబితాను జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలకు పంపించింది. వాటి ఆధారంగా పోలింగ్‌స్టేషన్ల వారీగా చెక్‌లిస్ట్‌లు సిద్ధం చేసిన తహసీల్దార్లు వాటిని బీఎల్‌వోలకు అందజేసి క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు. రెండుచోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారిని విచారించి ఎక్కడ ఉంచాలో, ఎక్కడ తొలగించాలో వారి నిర్ణయం మేరకు చర్యలు చేపడుతున్నారు. వాటి వివరాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.

జిల్లాకు 6,188 పీఎస్ఈల అందజేత

జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో ఫొటో సిమిలర్ ఎంట్రీస్ 6,188 ఉన్నట్లుగా గుర్తించిన ఎన్నికల సంఘం వాటి వివరాలను జిల్లాకు పంపించింది. వాటి ఆధారంగా 5,674 చెక్‌లిస్టులను సిద్ధం చేసిన అధికారులు వాటిని బీఎల్‌వోలకు అందజేసి క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు. ఇప్పటి వరకు 4,015 మంది ఓటర్లను ఒరిజినల్‌గా, 1,365 మందిని డూప్లికేట్‌గా నిర్ధారించారు. 190 ఓటర్ల ఫొటో సరిపోలనట్లుగా గుర్తించారు. ఓటర్లు అందుబాటులో లేకపోవడం, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం, మరణించడం వంటి వాటితో 865 మంది ఓటర్లను తేల్చారు. 2,606 ఓటర్లకు సంబంధించిన సమాచారం దొరకనట్లుగా పేర్కొంటూ వాటి వివరాలను తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో పకడ్బందీగా చేపడితే మరింత మంది డూప్లికేట్ ఓటర్లు తేలే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇలా అందిన వివరాలను నియోజకవర్గ కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎన్నికల సిబ్బంది ఈసీ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేస్తున్నారు. తొలుత ఒకే ఫొటో.. ఒకే పేరుతో రెండు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు కలిగి ఉండటం, ఒకే ఫొటో రెండు వేర్వేరు పేర్లతో కలిగి ఉండటం, వేర్వేరు పేర్లు దగ్గరి పోలికలతో ఉన్న ఫొటోలు ఉన్న వారిని గుర్తిస్తున్నారు. అలాంటి వారి ఓటు ఎక్కడ ఉంచాలో .. ఎక్కడ తొలగించాలో ఓటరు సంతకంతో నిర్ధారించుకుని చర్యలు చేపడుతున్నారు.

నిలిచిన వివరాల నమోదు

బీఎల్‌వోలు సేకరించిన వివరాలను ఈసీ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేయాల్సిన ప్రక్రియ వారం రోజులుగా నిలిచిపోయింది. ఈసీ వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ నేపథ్యంలో ఈ ప్రక్రియ నిలిచినట్లుగా రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. బీఎల్‌వోలు విచారించిన చెక్‌లిస్టుల వివరాలను సేకరించి ప్రస్తుతం కంప్యూటర్లలో నమోదు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈసీ వెబ్‌సైట్ ఓపెన్ అయిన వెంటనే అందులో ఈ వివరాలను నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తే వందశాతం పారదర్శకతతో కూడిన ఓటర్ల జాబితా సిద్ధమయ్యే అవకాశముందనే అభిప్రాయం అటు అధికారులు, ఇటు రాజకీయ నాయకుల్లో వ్యక్తమవుతోంది.

పకడ్బందీగా పరిశీలన

ఒకరికి ఒకే చోట ఓటు హక్కు ఉండాలనేది ఎన్నికల సంఘం నిర్ణయం. బోగస్ ఓటర్లను ఏరివేసేందుకు, రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారిని గుర్తించేలా వివరాలతో కూడిన జాబితాను జిల్లాకు పంపించింది. దాని ఆధారంగా క్షేత్రస్థాయిలో బీఎల్‌వోల ద్వారా పకడ్బందీగా పరిశీలన చేపడుతున్నాం. వంద శాతం పారదర్శకతతో కూడిన జాబితాలను సిద్ధం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– రాథోడ్ రమేశ్, ఆర్డీవో, ఆదిలాబాద్

జిల్లాకు ఈసీ పంపించిన పీఎస్ఈల వివరాలు..

నియోజకవర్గం	పీఎస్ఈలు	చెక్ లిస్టులు	ఒరిజినల్ ఓటర్లు	డూప్లికేట్ ఓటర్లు	ఫారం–7
ఆదిలాబాద్	3,273	3,069	2,049	647	316
బోథ్	2,915	2,605	1,966	718	472

ఏ కష్టమొచ్చినా అండగా ఉంటా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న, వేదికపై ప్రజాప్రతినిధులు, పర్ధాన్ సమాజ్ నాయకులు

- ఎమ్మెల్యే జోగు రామన్న
- ఘనంగా హీరా సుక జయంతి వేడుకలు



థింసా నృత్యం చేస్తున్న పర్ధాన్ కళాకారులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివాసీ పర్ధాన్ పురోహిత్ సమాజ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో గోండి ధర్మగురు హీరా సుక జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలాల నుంచి పర్ధాన్ కులస్తులు తరలివచ్చారు. అలాగే 11 రాష్ట్రాల నుంచి పర్ధాన్ సమాజ్ కుల పెద్దలు సైతం హాజరయ్యారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరా సుక చిత్రపటం వద్ద సంప్రదాయబద్ధంగా డోలు, వాయిద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా రాంలీలా మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలోని ఆదివాసీ పర్ధాన్ కులస్తులకు వివిధ పదవుల్లో అవకాశాలు కల్పించామన్నారు. అన్ని కులాల మాదిరిగా స్థలాల కేటాయింపు కోసం ఆదిలాబాద్‌లో ప్రత్యేక జీవో విడుదల చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరామన్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్‌లు విఠల్‌రావ్, జనార్దన్ రాథోడ్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జిల్లాలో హీరా సుక జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ పర్ధాన్ పురోహిత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దుర్వా నగేశ్, జాతీయ అధ్యక్షుడు కేపీ ప్రధాన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ గోడం వర్ష సునీల్, ఆదివాసీ పర్ధాన్ పురోహిత్ డివిజన్ అధ్యక్షుడు గోడం గంగారాం, నాయకులు సిడాం రాంకిషన్, తదితరులు పాల్గొన్నారు.

సమీక్షిస్తూ.. సందర్శిస్తూ

- పాలనపై పట్టుకు కలెక్టర్ యత్నం
- క్షేత్రస్థాయిపై ఫోకస్ పెంచిన రాహుల్‌రాజ్
- నెల రోజుల్లో తనదైన ముద్ర



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్ (ఫైల్)

కైలాస్‌నగర్: జిల్లా కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ బాధ్యతలు స్వీకరించి నేటికి నెల. ఈ క్రమంలో పాలనపై మరింత పట్టు సాధించే దిశగా ఆయన తనదైన పంథాలో ముందుకు సాగుతున్నారు. ఓ వైపు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ వారికి మార్గనిర్దేశనం చేస్తున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పథకాల అమలుతో పాటు వాటిలోని లోపాలను అధ్యయనం చేస్తున్నారు. అలాగే తనకు అందిన ఫిర్యాదులను చూసీ చూడనట్లు వదిలేయకుండా, క్షేత్రస్థాయికి వెళ్లి నిర్ధారించుకుంటున్నారు. జిల్లా పాలనను గాడిలో పెట్టేందుకు ఫోకస్ పెంచారు.అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయిలో పేదలకు అందించేలా తనదైన మార్కుతో ముందుకు సాగుతున్నారు.

ఓ వైపు సమీక్షలు.. మరోవైపు సందర్శనలు

సిక్తా పట్నాయక్ బదిలీ అనంతరం జిల్లాకు వచ్చిన రాహుల్‌రాజ్ ఈ ఏడాది ఫిబ్రవరి 1న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లాస్థాయి అధికారులతో 8వ తేదీన కలెక్టరేట్‌లో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. జిల్లా అభివృద్ధిపై తనకున్న లక్ష్యాలు, అమలుచేయాల్సిన కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రతి నెలా పనుల్లో ప్రగతి కనిపించాలని లేదంటే ఇబ్బందులు తప్పవని సుతిమెత్తగా హెచ్చరించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మన ఊరు–మన బడి, కలెక్టరేట్ స్థలాల అన్యాక్రాంతంపై పత్రికల్లో వచ్చిన కథనాలపై వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి వాటిపై ఆరా తీశారు. ఆయా అంశాలకు సంబంధించి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతటితో ఆగకుండా క్షేత్రస్థాయిలోనూ సందర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు, కలెక్టరేట్ నిర్మాణ స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిని సందర్శించి, నాణ్యమైన వైద్యమందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇప్పటికీ పలుశాఖల అధికారులు తమ శాఖలపై అంతగా దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. అలాంటి వారిపై దృష్టి సారిస్తే మరింత ప్రయోజనం చేకూరే అవకాశం లేకపోలేదు.

మున్సిపల్‌పై ప్రత్యేక దృష్టి

పాలనాపరమైన అంశాలతో పాటు జిల్లాలోని ఏకైక గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. ఆక్రమణలకు గురవుతున్న ఖానాపూర్ చెరువును సందర్శించారు. గుర్రపుడెక్క తొలగించి ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించడం పట్టణవాసుల్లో కొత్త ఆశలను చిగురింపజేసింది. అలాగే ఆక్రమణలకు గురైన చాందా బ్రిడ్జి సమీపంలోని ప్రభుత్వ భూములను పరిశీలించి, హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించడం ఆక్రమణదారులను కలవరానికి గురిచేసింది. ముఖ్యంగా సర్వే నంబర్ 21లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి వాటిని తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడం విదితమే. ఇక పట్టణంలో పారిశుధ్య నిర్వహణ తీరును రెండు రోజులుగా స్వయంగా పరిశీలిస్తున్నారు. వేకువజామునే ఆయా కాలనీల్లోకి వెళ్లి రోడ్లపై చెత్తపడేయకుండా ఉండాలంటూ ప్రజలకు సూచించడం.. అధికారులను ఆదేశిస్తుండడం తన పనితీరుకు అద్దం పడుతంది. కార్మికులను పారిశుధ్య నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకుంటుండటం ఆ విభాగం అధికారులను హైరానాకు గురి చేస్తోంది.

ఫిర్యాదుల విభాగంపై మార్క్

ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగంపై కూడా తన మార్కు చూపిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులంతా అందుబాటులో ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే అర్జీదారులు పదేపదే తిరుగకుండా ఉండేలా లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలంటూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. అర్జీల ప్రగతిని తెలియజేసేలా వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచాలని ఆదేశించడంతో సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుంది. తనదైన పనితీరుతో ముందుకు సాగుతున్న ఆయన ఇదే ఒరవడి కొనసాగిస్తూ తమ సమస్యలను పరిష్కరిస్తూ జిల్లాను అభివృద్ధి పథాన నిలపాలని జిల్లావాసులు కోరుతున్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

తాంసి: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. భీంపూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట అసంక్రమిత వ్యాధుల జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీధర్, పీహెచ్‌సీ వైద్యాధికారి విజయసారథి, వైద్యులు నిఖిల్‌రాజ్, సిబ్బంది తదితరులున్నారు.

పోలీస్‌శాఖలో సమయపాలన కీలకం

ఎదులాపురం: పోలీసు శాఖలో సమయపాలన కీలక అంశమని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఏఆర్‌ఎస్సైగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన జోగు ప్రభాకర్ దంపతులను స్థానిక ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో మంగళవారం ఆయన సన్మానించారు. ఇందులో ఏఎస్పీ శ్రీనివాసరావు, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జి.సత్యనారాయణ, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభాకర్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



గుబిడిలో పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

తాంసి: పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. భీంపూర్ మండలంలోని గుబిడి గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పల్లెప్రకృతివనం, సెగ్రిగేషన్ షెడ్, పాఠశాల, క్రీడా ప్రాంగణం, నర్సరీలను పరిశీలించారు. పలు వీధులను పరిశీలించి పల్లెప్రగతి పనులపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు పనులు త్వరగా చేపట్టాలని, త్రీఫేజ్ విద్యుత్ అందించాలని విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు స్వచ్ఛ గుబిడిగా ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం కరంజి(టి) గ్రామంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. భీంపూర్ పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. తహసీల్దార్,ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు,ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సర్పంచ్ లింబాజీ వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మహేంద్రనాథ్,పంచాయతీరాజ్ డీఈ శివరాం, ఏపీవో విజయ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, సర్పంచ్ ప్రతాప్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నరేందర్, గంగారాం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో..

అంతకు ముందు వేకువజామున ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త కుమ్మరివాడ, శాంతినగర్, రవీంద్రనగర్, ఓల్డ్ హౌజింగ్‌బోర్డు కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. చెత్తను రోడ్లపై పడేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్రగాయాలు


తీవ్ర గాయాలపాలైన ప్రకాశ్

భైంసాటౌన్: విద్యుదాఘాతంతో ప్రకాశ్ అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. భైంసా పట్టణంలోని సిద్దార్థనగర్‌కు చెందిన ప్రకాశ్ (35) స్థానికంగా వెల్డింగ్ పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం కుభీర్‌రోడ్డులోని భట్టి గల్లి సమీపంలో ఓ వ్యక్తికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో రేకులషెడ్డు కోసం వెల్డింగ్ పని చేస్తుండగా పైనున్న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో కాళ్లకు, మెడభాగంలో తీవ్రగాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తరలించారు.

ఫిట్స్‌తో విద్యార్థిని మృతి


కుమ్ర అనూష(ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గురుకులం పాఠశాలలో ఓ విద్యార్థిని మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, పాఠశాల నిర్వాహకుల వివరాల ప్రకారం... గుడిహత్నూర్ మండలంలోని చించుఘాట్ గ్రామానికి చెందిన కుమ్ర అనూష (14) గురుకులం పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. మూడు రోజుల క్రితం తరగతి గదిలో ఫిట్స్ రావడంతో స్పృహ కోల్పోయింది. వెంటనే సిబ్బంది ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న తుడుందెబ్బ ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థిని అనుష మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల పట్ల పాఠశాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని వైద్యం అందించాలని సూచించారు. ఇందులో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్, తుడుందెబ్బ జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి పెందోర్ పుష్పరాణి ఉన్నారు.

సాగునీటి కోసం కాంగ్రెస్ ఆమరణ దీక్ష


ఆమరణ దీక్షలో కాంగ్రెస్ నాయకులు

దండేపల్లి: కడెం ఆయకట్టుకు కడెం ప్రాజెక్ట్‌తోపాటు, గూడెం ఎత్తిపోతల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందించాలని మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి మంగళవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. యాసంగికి కడెం ప్రాజెక్ట్ నుంచి డీ–1నుంచి డీ–28వరకు, గూడెం ఎత్తిపోతల నీటిని డీ–30 నుంచి డీ–42 వరకు అందిస్తామని ప్రకటించినప్పటికీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందలేదని తెలిపారు. దీంతో పొలాలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తంజేశారు. గూడెం ఎత్తిపోతల పథకం యాసంగి ప్రారంభం నుంచి తరచూ మొరాయిస్తోందని, దీంతో ఎత్తిపోతలను నమ్ముకుని పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గూడెం ఎత్తిపోతల పైప్‌లైన్‌కు శాశ్వత మరమ్మతు చేయిస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేవరకూ దీక్ష విరమించబోమని తేల్చి చెప్పారు. దీక్షలో 16 మంది రైతులతో పాటు జెడ్పీటీసీ నాగరాణి, కాంగ్రెస్ సర్పంచులు చంద్రకళ, పుష్పలత, శంకరయ్య, శాంతయ్య, ఎంపీటీసీలు శ్రీనివాస్, నవీన్, మాలిక, హేమలత, ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, కాంగ్రెస్ మండలాధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఉన్నారు.

పంట రక్షణకు పరేషాన్


పీచరలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

- ధ్వంసం చేస్తున్న అడవి జంతువులు
- ఆర్థికంగా చితికిపోతున్న అన్నదాతలు
- పరిహారానికి దరఖాస్తు చేసుకోవాలంటున్న అటవీశాఖ అధికారులు


లక్ష్మణచాంద సమీపంలో మొక్కజొన్న చుట్టూ ఏర్పాటు చేసిన చీరల కంచె

నిర్మల్ జిల్లాలో సాగు విస్తీర్ణం..

పంట	ఎకరాలు
మొక్కజొన్న	లక్షా 20వేలు
వరి	70వేలు
శనగ	60వేలు
నువ్వులు	25 వేలు
పొద్దుతిరుగుడు	4వేలు

పంటలు కాపాడుకునేందుకు పలు మార్గాలు

- పంట చుట్టు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలి.
- బయో ఫెన్సింగ్ అనగా ముళ్ల చెట్లను పంట చుట్టు కంచెగా ఏర్పాటు చేసుకోడం.
- చేపల వలలు పంటల చుట్టు ఏర్పాటు చేసుకోవడం
- అనిడర్స్ అనే ఆటోమేటిక్ దిష్టిబొమ్మలు ఏర్పాటు చేసుకోవడం. ఇది ఒక దిష్టి బొమ్మలాగా పనిచేసే యంత్రం. ఇది పంట పొలంలోకి ఏ జంతువైన ప్రవేశించగానే వెంటనే ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్ ద్వారా గుర్తించి దానిపై క్రాంతి, ధ్వని ప్రసారం చేసి అడవి జంతువును పంట నుంచి వెళ్లగొడుతుంది. ఈ యంత్రం పూర్తిగా సోలార్‌తో పనిచేస్తుంది.
- బయో అకోస్టిక్స్ అనగా అడవి జంతువుల అరుపులు చేసే యంత్రాలు ఏర్పాటు చేసుకోవడం. వీటి వల్ల పంటలో పులులు, సంహాలు వంటి జంతువులు ఉన్నాయని భావించి అడవి పందులు రాకుండా ఉంటాయి.

నష్ట పరిహారం పొందడం ఇలా....

- పంటను అడవి జంతువులు ధ్వంసం చేస్తే ముందుగా అటవీశాఖ రేంజ్ అధికారి వద్దకు వెళ్లి తన పంటను అడవి జంతువులు నష్టపరిచాయని పంట వద్ద రైతు దిగిన ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తు స్వీకరించిన రేంజ్ అధికారి అటవీశాఖ బీట్ అధికారిని గ్రామానికి పంపి పంచనామా చేయిస్తారు.
- బీట్ అధికారి, గ్రామ సర్పంచ్, ఏఈవో కలిసి పంట వద్దకు వెళ్లి పంచనామా నిర్వహిస్తారు.
- తరువాత ఏఈవో రైతు పంటలో ఎంత వరకు నష్టం జరిగిందో అంచనా వేసి అటవీశాఖ అధికారులకు నివేదిక అందజేస్తాడు.
- దాని ఆధారంగా అటవీశాఖ రేంజ్ అధికారి డివిజనల్ అధికారికి నివేదిస్తాడు.
- బడ్జెట్ వచ్చిన తరువాత నష్టం జరిగినట్లు ధ్రువీకరణ జరిగిన తరువాత రైతుకు ఎకరా మొక్కజొన్నకు రూ.6000 నష్టపరిహారం అందచేస్తారు.
- అడవి జంతువులతో రైతులకు ప్రమాదం జరిగితే రూ.20,000, రైతు మృతి చెందితే రూ.5లక్షల పరిహారం అందజేస్తారు.

లక్ష్మణచాంద: రైతులకు పంటలను కాపాడుకోవడం సవాల్‌గా మారింది. అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో అడవి జంతువులు నాశనం చేస్తుండడంతో అన్నదాతలు తల్లడిల్లిపోతున్నారు. దీంతో పంటలను రక్షించుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట చేతికి వస్తున్న సమయంలో అడవి జంతువుల దాడిలో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను కాపాడుకోవడానికి రాత్రి పగలు పంటవద్దే పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

పంటల రక్షణకు ఇబ్బందులు...

పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పంటల చుట్టూ పాత చీరల కంచెను, వలతో తయారు చేసిన కంచెను, మైకులు వంటి పలు మార్గాలను ఎంచుకుంటున్నారు. పంటల సాగుకు పెట్టుబడితో పాటు కాపాడుకునేందుకు సైతం ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంటను ఎక్కువ మొత్తంలో నష్టపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు సోలార్ కంచెలకు రుణాలివ్వాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మండలంలోని రైతుల సాగు చేసిన మొక్కజొన్న పంటను అడవి పందులు, కోతులు దాడి చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అధికారులతో సర్వే చేయించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– నర్సయ్య, రైతు, పొట్టపెల్లి (కే)


బాధిత రైతులు సంప్రదించాలి



మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు అడవి జంతువులతో నష్టపోతే తమను సంప్రదిస్తే తాము అటవీశాఖ అధికారులకు తెలియజేస్తాం. బాధిత రైతుకు సాయం చేయడానికి తమవంతుగా కృషి చేస్తాం.

– ప్రవీణ్‌కుమార్, ఏవో

సద్వినియోగం చేసుకోవాలి



మండలంలో అడవి జంతువుల వల్ల పంటలు నష్టపోయిన రైతులు తమను సంప్రదించాలి. తమ శాఖ ద్వారా వ్యవసాయ శాఖ వారితో కలిసి నష్టపరిహారం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. నిధులు వచ్చిన వెంటనే అందచేస్తాం.

– నజీర్‌ఖాన్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, పొన్కల్

రైతుల కోసం ఆమరణ నిరాహార దీక్ష

- పరిహారం చెల్లించాలని దీక్ష చేపట్టిన కాంగ్రెస్ మండల కన్వీనర్ మల్లేశ్


ఆమరణ నిరాహార దీక్షలో కాంగ్రెస్ మండల కన్వీనర్ మల్లేశ్, రైతులు

తాంసి: పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న రైతుల భూములకు వెంటనే ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మల్లేశ్ డిమాండ్ చేశారు. పరిహారం కోసం రైతులు చేపడుతున్న రిలే దీక్షల్లో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మల్లేశ్ మంగళవారం పాల్గొని రిలే దీక్షలకు మద్దతు తెలిపి ఆమరణ నిరాహార దీక్షకు దిగాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులుగా పరిహారం పెంచి అందించాలని రైతులు దీక్షలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇచ్చే వరకూ ఆమరణ నిరాహార దీక్ష విరమించేది లేదని చెప్పాడు. రైతు సంక్షేమమని చెబుతున్న ప్రభుత్వం రైతులు పరిహారం కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రైతులు స్వామి, నర్సింగ్, నసీరుద్దీన్, లక్ష్మారెడ్డి ఉన్నారు.

చెట్ల విక్రయానికి వేలం

ఉట్నూర్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా బుదాకలాన్ ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రంలో పెంచిన చెట్లను విక్రయించేందుకు వేలం వేస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో కె.వరుణ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బుదాకలాన్ ఉద్యాన నర్సరీ పరిధిలోని 1214 వేప, 239 తుమ్మ, 638 వివిధ రకాల చెట్లను విక్రయించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆసక్తి గల వారు ప్రాజెక్టు అధికారి ఐటీడీఏ ఉట్నూర్ పేరున రూ.1000 ఈఎండీ డీడీతో ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు టెండర్ల కోసం సీల్డ్ కవర్లు అందజేయాలని, మార్చి 3న సాయంత్రం 5.30గంటలకు టెండర్లు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓఎస్డీ ఐటీడీఏ ఉట్నూర్ 9959868998 సంప్రదించాలని కోరారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

- మూడు నెలల తర్వాత మృతదేహం లభ్యం


అబ్రాన్(ఫైల్)

సారంగపూర్: మూడు నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యువకుడు శవమై కనిపించాడు. ఈ సంఘటన మండలంలోని స్వర్ణ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. సయ్యద్ అబ్రాన్(30) ఐదేళ్ల క్రితం దుబాయికి ఉపాధి నిమిత్తం వెళ్లాడు. గతేడాది నవంబర్ మొదటి వారంలో స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. తల్లిదండ్రులు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ అమ్మాయితో వివాహం నిశ్చయించారు. దీంతో నవంబర్ 27వ తేదీన పెళ్లి పనుల నిమిత్తం బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన అబ్రాన్ ఆ తరువాత కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ కానరాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. తాజాగా మంగళవారం ఈద్గాగుట్ట వైపు వెళ్లిన గ్రామస్తులకు కుళ్లిపోయిన మృతదేహం చెట్టుకు వేలాడుతూ కలిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్యాంట్ జేబులో ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు లభించడంతో అబ్రాన్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి వేణుగోపాల క్రిష్ణతో సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనా స్థలాన్ని నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వసంత్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: కడుపునొప్పి బాధ భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంగటన మండలంలోని చిట్యాల్‌బోరి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆడే ముత్యాలు (44) కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్న నయం కాలేదు. దీంతో వ్యవసాయ పొలానికి వెళ్లినా ఆయన అక్కడే పురుగుల మందు తాగిపడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య శకుంతల, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఫతేసింగ్ తెలిపారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- నాగల్‌కొండ రోడ్డుపై ఖాళీ బిందెలతో బైఠాయింపు
- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ హామీతో ఆందోళన విరమణ


రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన మహిళలు

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి వారం రోజులుగా తాగునీటి సరఫరా కాకపోవడంతో మంగళవారం మహిళలు ఆందోళనకు దిగారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై ఐదు గంటల పాటు బైఠాయించారు. ఆందోళన విషయాన్ని స్థానిక ఎంపీటీసీ బాదావత్ కళావతి ఉత్తం ఫోన్‌లో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి మిషన్ భగీరథ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు నాగల్‌కొండ గ్రామానికి చేరుకుని భగీరథ నీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు సరఫరా చేయిస్తానని జెడ్పీ చైర్మన్ హామీతో ఆందోళన విరమించారు. గ్రామస్తులు మాట్లాడుతూ వారం రోజులుగా తమ గ్రామానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. మిషన్ భగీ రథ, గ్రామ పంచాయతీ ద్వారా నీళ్లు రావడం లేదన్నారు. నీటి తీవ్రత తీవ్రంగా ఉన్నప్పటికీ ఎవ రు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిందెడు నీటి కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తోందని వాపోయారు. నీటి సౌకర్యాన్ని కల్పించపోతే ఎంపీడీవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే ఆస్తులపై విచారణ జరపాలి


టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆమె భర్త టీజీవో జిల్లా అధ్యక్షుడు శ్యామ్ నాయక్‌లు అవినీతి అక్రమాలకు పాల్పతున్నారని, వారి ఆస్తులపై ప్రభుత్వం ఏసీబీతో విచారణ జరిపించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రేఖానాయక్ నియోజకవర్గంలోని గ్రామపంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్ల కొనుగోలులో అవినీతికి పాల్పడ్డారని, సబ్సిడీ పేరుతో ఉట్నూర్ మండలంలోనే తనకు తెలిసిన ముగ్గురు ఆదివాసీ గిరిజనులను మోసం చేశారని తెలిపారు. ఏఆర్ఎస్ షోరూం ఏర్పాటు చేసి అక్కడే ట్రాక్టర్లు కొనుగోలు చేయాలని తమ వ్యాపారాన్ని సాఫీగా కొనసాగిస్తున్నారన్నారు. సబ్సిడీ రాక మళ్లీ ట్రాక్టర్లను లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా మైనార్టీ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు అభ్యర్థుల నుంచి రూ.లక్షలకు పైగానే వసూలు చేశారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌కు ఎన్నికల ముందు చూపిన ఆస్తుల విలువ కంటే రెండింతలు పెరిగిందన్నారు. ఎమ్మెల్యే భర్త శ్యామ్ నాయక్ వృత్తిపరంగా జగిత్యాల జిల్లా రవాణా అధికారిగా కొనసాగుతున్నప్పటికీ నామమాత్రంగా విధులకు హాజరవుతూ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని డబ్బుల కోసం జిల్లాలోని రవాణా శాఖ అధికారులను బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయాల్లోకి రావాలని ఉద్దేశం ఉంటే ముందుగా ఉద్యోగానికి రాజీనామా చేయాలన్నారు. ఎమ్మెల్యే దంపతులు అనేక అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ఎమ్మెల్యే ఆస్తులపై ఏసీబీతో విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

అన్నాచెల్లెళ్లకు వంట గ్యాస్, ఆర్థికసాయం


వంట గ్యాస్, నగదు అందజేస్తున్న దాతలు

దహెగాం: మండలంలోని చౌక గ్రామానికి చెందిన అన్నాచెల్లెళ్ల దీన గాథపై ఫిబ్రవరి 15న 'అన్న పనిచేస్తేనే.. చెల్లెళ్ల కడుపు నిండేది' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో దాతలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి సాయమందిస్తున్నారు. ఇదే క్రమంలో రెబ్బెన మండలానికి చెందిన దేవర వినోద్ యువసేన ఆధ్వర్యంలో మంగళవారం అన్నాచెల్లెళ్లకు వంట గ్యాస్ పొయ్యి అందజేశారు. గుంటూరు జిల్లాకు చెందిన అనిల్ అనే యువకుడు రూ.3 వేల నగదు అందించారు. కార్యక్రమంలో కొండపల్లి సర్పంచ్ సంజీవ్, ఆగర్‌గూడ సర్పంచ్ సుధాకర్, యువకులు సునీల్, సాయివర్ధన్, ప్రదీప్, నారాయణ, హరీశ్ తదితరులున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి


హైవే అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ఆదిలాబాద్‌రూరల్: జాతీయ రహదారి గుండా ఆదిలాబాద్ పట్టణానికి ప్రవేశించే మార్గంలో జరుగుతున్న రహదారి ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఇటీవల చాందా(టి) సమీపంలో బైపాస్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రమాద స్థలాన్ని డీఎస్పీ ఉమేందర్, ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి ఎస్పీ మంగళవారం పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రహదారి నిర్మాణంలో లోపాలు, సరిదిద్దాల్సిన అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల జాతీయ రహదారిపై ప్రమాద ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి రహదారి ప్రమాదాలు జరగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రయాణికులు హైవే మీదుగా కాకుండా సర్వీస్ రోడ్డును వినియోగిస్తే ప్రమాదాలు తగ్గే ఆస్కారం ఉందని, ఆ దిశగా బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రాస్తారోకో


రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు, మాట్లాడుతున్న సీఐ రఘుపతి

- రోడ్డుపై బైఠాయించిన వివిధ గ్రామాల ప్రజలు

ఆదిలాబాద్‌రూరల్: రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు మంగళవారం మండలంలో ని లాండసాంగ్వి గ్రామ సమీపంలోని వంతెనపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైనథ్ మండలం తర్నం గ్రామ సమీపంలోని వంతెన కుంగిపోవడంతో ఆ వైపు నుంచి వెళ్లే భారీ వాహనాలు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామం మీదుగా వెళ్తున్నాయని తెలిపారు. దీంతో సింగిల్ రోడ్డు కావడం, రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో సైతం తర్నం వంతెన చెడిపోయిన సమయంలో లాండసాంగ్వి మీదుగా వాహనాలు వెళ్లాయన్నారు. ఆ సమయంలోనే త ర్నం సమీపంలో కొత్త వంతెన నిర్మాణం చేపడితే ఈ పరిస్థితి ఎదురయ్యేది కదన్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని తెలిపా రు. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి అక్కడి చేరుకుని రాస్తారోకో విరమించాలని కోరారు. అయినా వినకుండా మూడు గంటల పాటు నిర్వహించారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లాండసాంగ్వి, అర్లి (బి), జైనథ్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

తప్పిన పెనుప్రమాదం

- కడెం ప్రాజెక్ట్ పైనుంచి అదుపుతప్పిన కారు
- స్వల్ప గాయాలతో బయటపడ్డ ఐటీడీఏ ఏఈ కుటుంబం


అదుపుతప్పిన కారు


స్వల్ప గాయాలతో బయటపడిన ఏఈ కుటుంబ సభ్యులు

కడెం: ఐటీడీఏ ఏఈ కుటుంబం పెను ప్రమాదం నుంచి బయటపడింది. ఏఈ ప్రశాంత్‌రెడ్డి తన భార్య, పదిహేను నెలల కుమారుడితో కలిసి మంగళవారం కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించడానికి వెళ్లారు. ప్రాజెక్ట్ మెయిన్ గేట్ సమీపంలోని జనరేటర్ రూం పక్కన పార్కింగ్ చేసిన కారును రివర్స్ తీసుకునే క్రమంలో కారు అదుపు తప్పి కిందకు పల్టీలు కొట్టింది. మధ్యలోని చిన్న కాల్వలో టైర్లు ఇరుక్కుని కారు ఆగిపోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికుల సాయంతో వారు కారులోంచి బయటకు వచ్చారు. ఈ ప్రమాదంలో కారు మధ్యలో ఆగి ఉండకపోతే సుమారు 50మీటర్ల ఎత్తు నుంచి కిందపడేది. ఈ ప్రమాదంలో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.